# పుల్లంరాజు-1

పుల్లంరాజు చక్రవర్తి దుప్పలపూడి సామ్రాజ్యాన్ని యేకచ్ఛత్రాధిపతియై యేలుతూ వున్నాడు. వయస్సు పాతిక యేళ్ళకు మించదు. సంవత్సరమే అయింది పట్టాభిషేకం అయి. అతను యువరాజుగా వున్నప్పుడు తన పరిపాలనాన్ని హిందూ దేశం అంతటిలోనూ అద్వితీయమూ, ఆశ్చర్యకరమూ చెయ్యాలని వూహించుకున్నాడు. పట్టాభిషేకం నాడే మార్గాలు వెయ్యడం మొదలు పెట్టేడు. ఆరుమాసాలు గడిచేక వొక్కొక్కటే వొక్కొక్కటే ఆచరణలోకి తీసుకురావడం మొదలుపెట్టాడు. ప్రారంభించినవన్నీ గాలప్పురుగు మీద జరిగిపోతున్నాయి. దుప్పలపూడి నగరంలో వున్న నాగరికులూ, సామ్రాజ్యం అంతటా వున్న ప్రజలూ ముందు యేది యెలా వుంటుందో అని అడిలిపోతున్నారు.

చక్రవర్తి సామాన్యుడు కాదు. యూరోపు అంతా తిరిగివచ్చాడు. అమెరికాలో సగం చూశాడు. జపానూ, చీనా, కాబూలూ, ఆఫ్రికా మొదలయిన ఖండాలూ దేశాలూ గూడా చూశాడు. హిందూ దేశంలో వున్న ప్రాంతాల మాట యిక చెప్పడం యెందుకూ? అతని చూపు యెప్పుడూ బొంబాయి మీద వుంటుంది. మనస్సు యెప్పుడూ కలకత్తా మీద వుంటుంది. నీలగిరి కొండల్లో తరుచు వాసం చేస్తూ వుంటాడు. చెన్నపట్టంలో రెండు బంగాళాలు వున్నాయి. అతను చక్రవర్తి గనక యెక్కడికి వెళ్ళినా తన సొంత రయిలు మీద వెడతాడు. హిందూదేశంలో అంత అందమైనదీ, సుఖం కలిగించేదీ మరో రైలుబండి యెక్కడా లేదు.

నీలాద్రిరాజుకి యితను వొక్కడే కొడుకు. లేకలేక యిక కలగదు సంతానం అని నిరాశ చేసుకుని దత్తత చేసుకోవడానికి ఆలోచనలు చేస్తూ వుంటే పుట్టుకువచ్చాడితను. శరీరచ్ఛాయ కారు నలుపే గాని అతని అదృష్టం అంతా కనుబొమ్మల్లో వుందని అంతా చెప్పుకుంటూ వుంటారు. తల్లీదండ్రీ గూడా పచ్చని దబ్బపండులాంటి వాళ్ళయినా యితను గర్భంలో వున్నప్పుడు తల్లి కారం యెక్కువ తిని వుంటుందనీ, అంచేతే యితని శరీరచ్ఛాయ యిలా వుందనీ ఆస్థానవైద్యులు నిశ్చయించారు. కొడుకు నల్లగా నేరేడుపండులా వున్నా లేకలేక కలగడం చేత, తల్లికీ తండ్రికీ గూడా యితణ్ణి చూస్తే బ్రహ్మానందం. దాదులు కూడా వెన్నప్పంలా పెంచారు.

దుప్పలపూడి సామ్రాజ్యంలో వక్క తెలుగు తప్ప యింకే భాషా లేకపోయినా ప్రపంచం అంతటా వున్న భాష కనక చిన్నతనంలోనే అతనికి యింగ్లీషు భాష మొదలు పెట్టించాడు తండ్రి. యిలాంటి చక్రవర్తి హిందూదేశంలో యెక్కడా లేడు కనక యితని పక్కని కూచోదగిన విద్యార్థులూ, యితను కూచోదగిన కళాశాలా

లేకపోవడం చేత తండ్రి యింట్లోనే యింగ్లీషు చెప్పించాడు. దానికోసం నెలకి ఒక్కొక్కడికి వెయ్యిరూపాయలు చొప్పున నలుగురు దొరల్ని యేర్పరిచాడు. తెనుగు చదవడమూ రాయడము మట్టుకు నేర్పించాడు. హిందూస్థానీ మాట్లాడడం గూడా నేర్పించాడు. అయినా చక్రవర్తి తరుచు యింగ్లీషులోనే మాట్లాడతాడు. అతని భార్య కాపరానికి వచ్చేటప్పటికి రాకపోయినా పెనిమిటితో మాట్టాడ్డానికి అర్హత వుండాలని తరవాత నేర్చుకుంది యింగ్లీషు. ముగ్గురు దొరసాన్లు చెప్పేరు ఆవిడికి ఆభాష.

నీలాద్రిరాజు తన డబ్బయ్యో యేట కొడుక్కి పట్టం కట్టేడు. ఆ వుత్సవానికి మదరాసు గవర్నరూ, ఇంకా పెద్ద వుద్యోగస్థులు చాలామంది వచ్చారు. రాజ్యం యేలినన్నాళ్ళూ అతను మంచివాడనీ చతురుడనీ న్యాయం ప్రధానంగా చూస్తాడనీ విద్యలలో భోజుడంతవాడనీ పేరుపొందేడు. అతని కాలంలో అనేక విద్వాంసులు దుప్పలపూడి వచ్చి నివసించారు. సామ్రాజ్యంలో పేరుపొందిన వేశ్యలందరూ వచ్చారు. శిల్పులూ, కవులూ, గాయకులూ, చిత్రలేఖకులూ, వస్తాదులూ... అంతా వచ్చారు. నగరంలో సగందాకా ఈరకం మనుష్యులే వున్నారు. అతనికి సంగీతమూ, కవిత్వమూ, అభినయమూ, గుఱ్ఱపుస్వారీ చాలా యిష్టం: ఈ విద్యల్లో ఆరితేరిన వాళ్ళని అతను ప్రాణంగా చూచుకునీవాడు. ఆరకం వారికి అనేకులికి అగ్రహారాలు యిచ్చాడు.

వకనాడు మేజువాణీ జరుగుతోంది. సభ అంతా కిటకిటలాడుతూ వుంది. నగరంలో కల్లా పేరుపడ్డ మధురవాణి అనే వేశ్య గజ్జె కట్టింది. సభని చూసీ, చక్రవర్తిని చూసీ మధురవాణి పొంగిపోతోంది. చక్రవర్తి పరవశుడై వున్నాడు. సభ అంతా ఆశ్చర్యంలో మునిగి వుంది. ఈ సమయంలో మధురవాణి తాను అభినయించే వర్ణానికి అనుగుణంగా తన జడ ప్రభువు మెడకి చుట్టి ముందుకి లాగింది. ఆసాహసం చూసీ, ఆనేర్పు చూసీ చక్రవర్తి దానికి వెంటనే కోరుకున్న వూరు అగ్రహారంగా యిచ్చేసి ఆ గ్రామానికి జడభరతపురాగ్రహారం అని పేరు పెట్టేడు.

చెప్పవచ్చిందేమిటంటే, నీలాద్రిరాజు అలాంటి రసగ్రహణపరుడు. ఈకారణం చేత నగరం అంతా విద్వాంసులతో నిండివుంది. ముసలాతను సింహాసనం మీద వున్నంతకాలమూ విద్వాంసులు కొత్తకొత్తవాళ్ళు వచ్చి నగరంలో ప్రవేశిస్తూనే వున్నారు.

పువ్వుపుట్టగానే పరిమళం అన్నట్లు పుల్లంరాజు చక్రవర్తికి యివ్వేవీ యిష్టం లేవని నగరంలో వాళ్ళంతా గ్రహించారు. ముందుముందు లాభం లేదనుకున్నారు. "నీలాద్రిరాజు బతికి - తక్తుమీద వున్నంతకాలమే మనకి గౌరవం" అని నిశ్చయించుకొని అందఱూ ముఖస్తుతులు ప్రారంభించారు. "నన్ను నమ్మి వచ్చారు. సంతోషం కలిగించారు. నాచేతనైనంత యిప్పుడే సాయం చెయ్యడం మంచిది" అని నీలాద్రిరాజు అందఱికీ బహుమతీలు విశేషంగా యిచ్చాడు.

# 2

పుల్లంరాజుకి పట్టాభిషేకం అయింది. మన్నాడు నీలాద్రిరాజు నగరం విడిచి అంతకి మునుపే పురోపకంఠంలో తయారు చేయించుకున్న మేడలోకి వెళ్ళిపోయాడు, మళ్ళీ అతను నగరంలో కాలు పెట్టలేదు. ముసలిరాణి మాత్రం యెప్పుడేనా వచ్చి చూసిపోతూ వుంటుంది.

రామచంద్రయ్యకి ఆ కుటుంబం గుట్టు అంతా తెలుసును. పైగా ఆలోచనలో అంతవాడు లేడు. అసాధ్యుడు. "నేను నీకేమీ చెప్పక్కర్లేదు. యితని సలహామాత్రం దాటకు" అని నీలాద్రిరాజు చెప్పగా పుల్లంరాజు "అలాగే" అన్నాడు. చాలామట్టుకి అలాగే చేస్తున్నాడు కూడానూ; కాని వకరోజు కంటే వకరోజు దూరంగా వుంచుతున్నాడతన్ని.

ఈ ముసలాడు తప్ప చక్రవర్తిని ఆశ్రయించుకున్న తక్కినవాళ్ళంతా చిన్నవాళ్ళే. వారందరి ఆలోచనలూ, మార్గాలూ, రుచులూ వేఱు. వకటి రెండు విషయాల్లో భేదం వున్నా తమ లాభం కోసం చక్రవర్తి దగ్గిర యెదురు చెప్పరు. రామచంద్రయ్య మాత్రం అలా కాదు. "అది తప్పు. నష్టం రావచ్చు. యిలా చేస్తే మంచిదీ" అని చెబుతాడు. దానికి పడుచువాళ్ళంతా "ముసలాడూ. అతని ఆలోచనలు ఈకాలానికి పనికిరావు" అని ప్రభువుతో చెబుతారు. ప్రభువు నవ్వి అవునంటూ వుంటాడు కాని వక్కక్కప్పుడు రామచంద్రయ్య సలహాని సుతరామూ దాటడు.

ఆనగరంలో భోగం వాళ్ళవీధి మధ్యగా వుంటుంది. చాలా పొడుగూ. అయిదు వందల గడపకి తక్కువ వుండదు. అన్నీ మేడలే. నీలాద్రిరాజు ప్రభుత్వం చేశాటప్పుడు ఏ వుత్సవం చేసినా ముందుగా ఆవీధిలోనుంచే వెళ్ళాలి. వేశ్యలందఱూ చక్రవర్తికి ... పోసి హారతులిచ్చేవారు.

పుల్లంరాజు మోటారెక్కి వకనాడు వూరంతా చూశాడు. ఆవేళ పండుగు అవడం చేత బ్రాహ్మలేమిటి, కోమట్లేమిటి, క్షత్రియులేమిటి, రెడ్లూ, కమ్మవారూ, కాపులూ - యింకా యిలాంటి వారంతా అక్కడక్కడ భోగం మేళాలు చేయిస్తూనూ, గానసభలు చేయిస్తూనూ, అవధానాలు చేయిస్తూనూ, పురాణాలు చెప్పిస్తూనూ, మల్లవిద్యలు చేయిస్తూనూ ఆనందిస్తూ వున్నారు. చక్రవర్తి అన్నీ చూశాడు. అన్నిచోట్లా జనం వున్నా మేజువాణీల దగ్గిర పడుచువాళ్ళు అధికంగా వుండడం చూశాడు. ఇది బాగుంది కాధనుకున్నాడు. దిద్దెయ్యాలనుకున్నాడు. ముగ్గురు దొరలతోటీ, నలుగురు బంగాలీల తోటీ ఆలోచించాడు. మన్నాడు తెల్లవారేటప్పటికి "భోగం మేళం యెక్కడా జరగ్గూడదు. యెవరూ చూడగూడదు" అని తాఖీదులు నగరం అంతా నిండిపోయాయి. మొదట నగరంలో మట్టుకే యీ ప్రయత్నం చేసి లాభనష్టాలు చూడాలనుకున్నాడతను.

పౌరులు అంతా గందరగోళం పడ్డారు. వేశ్యలంతా ప్రమానుపడ్డారు. రామచంద్రయ్య తెల్లపోయాడు.

ప్రజల్లో పెద్దలనేకులు రామచంద్రయ్య నాశ్రయించేరు.. వేశ్యానాయికలుగూడ పాదాలు పట్టేరు. "ఆలోచిస్తాను వెళ్ళండన్నాడ"తను. అన్నీ వుద్దూరాలు పుడుతున్నాయి. యితగాడిదంతా కొత్త ప్రపంచకం. దగ్గిర చేరినవాళ్ళు కూడా తాళగాళ్ళే "అయినా ప్రయత్నిస్తాన"ని చెప్పి వాళ్ళని పంపేసి చక్రవర్తితో మాట్లాడేడు. "భోగం వాళ్ళు చేసే వృత్తి వ్యభిచారం. సంగీతాన్నీ, అభినయాన్నీ వాళ్ళు దానికి ఆధారంగా చేసుకుంటున్నారు. నా ప్రభుత్వంలో వ్యభిచారం - అందులోనూ అందుకోసం వక జాతి వుండకూడద"న్నాడు చక్రవర్తి. "ఆటపాటలు మానిపిస్తే ప్రజలికి వేశ్యాదర్శనం తరుచు కాదు. వివాహాలు పవిత్రం అవుతాయి. దేవాలయాలు పుణ్యస్థలాలు అవుతాయి. నేను ఈ మాట తిప్పను: మేజువాణీలు జరగ్గూడదు ఈ నగరంలో" అని కూడా ఖచ్చితంగా చెప్పేడు.

రామచంద్రయ్య "యీమార్గం యెంతవఱకూ వెడుతుందో చెప్పమ"న్నాడు. "అది మంచిమాట. నాపట్టంలో - తరువాత నా సామ్రాజ్యంలో కూడా వేశ్యాజాతి - అంటే వివాహాలు మాని సానులుగా వుండే తెగ వుండగూడదు" అని చక్రవర్తి చెప్పేడు. "వొక్కొక్కటే వొక్కొక్కటే మెట్టు చొప్పున యీపని పూర్తి చేస్తాను. మీరు సాయపడాలి" అని గూడా అతడు చెప్పేడు.

## 3

రామచంద్రయ్య ఆలోచనలో పడ్డాడు. వారందినాలు యోచించినా చక్రవర్తి మనస్సు తిప్పగలిగే వుపాయం తోచలేదు. "అయినా చివరికి పశ్చాత్తాపం కలిగించే యత్నం చెయ్యడం మంచిదీ. చక్రవర్తి యోచన యెప్పటికీ నెరవేరదు. ఈ ప్రయత్నాలకి పూర్ణఫలం విద్యలు నశించడమే. యింతకంటే పెద్ద చక్రవర్తులు ప్రయత్నించినా లోకంలో చెడ్డ లేకుండా చేయలేరు. ఇదివరకే ప్రజలికి జన్మాంతర సంచితాలైన కర్మలు వుండడం చేత బ్రహ్మదేవుడు గూడా చెయ్యలేడు ఆపని. కాని ముందు యేమౌతుందో చూద్దాము" అని యాతడు నిశ్చయించుకొని "మీయాజ్ఞకి అడ్డులేదు. అయినా వక్క పనిమాత్రం చేయించండి. ఇప్పుడు సానులు గల వేశ్యల యిళ్ళు యెన్ని వున్నాయో, వ్యభిచరించుతూ బతికే కులటల యిళ్ళు యెన్ని వున్నాయో, యెందరు కులస్త్రీలు వున్నారో లెక్క వేయించండి. " అని చెప్పేడు. "ఇది మంచి ఆలోచనే. అలాగే చేయిస్తాను" అని చెప్ప చక్రవర్తి అలాగే చేయించాడు. సంసారంలో వుండీ - అనగా భర్తలతో కాపరాలు చేసుకుంటూ వుండీ కూడా డబ్బుకోసం వ్యభిచరించే సంసార స్త్రీల లెక్క కూడా చక్రవర్తి కోరడం చేత యీ విషయంలో పత్తేదారులుకూడా పనిచెయ్యవలసి వచ్చింది.

అధికార్లు పదిహేను రోజుల్లో లెక్కలు తేల్చారు. వేశ్యల యిళ్ళు 489. సానులు 3,156. కులటల యిళ్ళు 5,138. కులటల సంఖ్య 13,753.

వ్యభిచారిణులు - అంటే భర్తలతో కాపరాలు చేసుకుంటూ చెడునడతలు నడిచేవాళ్ళు 78,504. మొత్తం 45,413. ఆనగరంలో వుండే జనసంఖ్య 15,76,478. అందు స్త్రీలు 9,83,578గురు. యౌవనవతులు 6,58,176గురు. రామచంద్రయ్య "చిత్తం" అని చెప్పి యీ అంకెలు తన నోటుబుక్కులో రాసుకున్నాడు. "చక్రవర్తిగారి ఆజ్ఞ చాలా బిగిసిపోయింది. ఎంత ప్రయత్నం చేసినా లాభం కలగలేదు. ఆయాజ్ఞకి భంగం యేమాత్రం వచ్చినా కఠిన శిక్షలు పడతాయి. జాగర్తగా మసులుకోండి" అని యాతడు ఈ ఆంక్ష తొలగించవలసినదని తన్నాశ్రయించిన వారికి కబురు పంపేడు.

ఈ ఆజ్ఞ దుప్పలపూడి నగరం మట్టుకే అని వుండడం చేత సానులు పొరుగూరు మేళాలకి వెళ్ళడం మానలేదు. ఈ సంగతి తెలిసి చక్రవర్తి యిలాగ ఆజ్ఞ జారీ చేయించాడు. "ఈనగరంలో వున్న సానులు పొరుగూళ్ళలో గూడా మేజువాణీలు చెయ్యగూడదు. .ఆపనికోసం యితరదేశాలు కూడా పోగూడదు. ఈవూరు నుంచి లేచిపోగూడదు. పొరుగూరు వెడితే మన్నాడే రావాలి. తరుచు - సంవత్సరానికి ఆరుమాట్లుకంటే నగరం దాటి వెళ్ళకూడదు"

వేశ్యలకు పుట్టబడ్డ యీనాముల నన్నిటినీ జిరాయితీలుగా యిచ్చేశాడు చక్రవర్తి. ఆనగరంలో నౌఖరీ యినాములు లేనివాళ్ళే లేరు. వున్న వాళ్ళెవరేనా వుంటే వాళ్ళు అనుభవించవలసినదే.

చిరకాలాన్నించీ అలవాటులో వున్న విషయం గనక మేజువాణీ లేకుండా పెళ్ళిళ్ళు వగైరాలు చేసుకోవడం యిష్టం లేనివాళ్లు ఆకార్యాలు పొరుగూళ్ళలో చేసుకోవడం మొదలు పెట్టారు. యిలా జరగడం వక సంవత్సరం చూశాడు చక్రవర్తి. అప్పుడు ఆయాజ్ఞ జిల్లా కంతా వర్తింపచేశామన్నాడు.

రెండేళ్లు గడిచేయి. చక్రవర్తి మళ్ళీ అంకెలు తీయించేడు. వ్యభిచార వృత్తిలో వున్న స్త్రీల సంఖ్య 45,413 నుంచి 50,004టికి పెరిగింది. విచారణ చేయించగా వేశ్యలతో ఆడుపిల్లల పెంపకం అధికం అయినట్లు తెలిసింది. దొరలూ, బంగాళీలూ మళ్ళీ ఆలోచనలు చెప్పేరు. "సానులు సానులుగా చెయ్యడం కోసం పెంచుకోడానికి వల్లగాదు. వున్నవాళ్ళు తప్ప యిక కొత్తగా సానుల్ని చెయ్యడానికి వీల్లేదు" అని చక్రవర్తి మళ్ళీ శాసించాడు.

## 4

యేళ్ళు గడిచాయి. మళ్ళీ లెక్క తియ్యమన్నాడు చక్రవర్తి. వేశ్యల సంఖ్య తగ్గినట్టు కనిపించింది. "ధన్యుణ్ణి" అనుకున్నాడు చక్రవర్తి. బుద్ధిని మరో సంస్కారంమీదకి మరలించాడతను. "రజస్వల అయితే గాని యేజాతివాళ్ళూ ఆడపిల్లలికి పెళ్ళి చెయ్యగూడదు. వక మతంలో వున్న స్త్రీ గాని పురుషుడు గాని యింకోమతంలో వున్న స్త్రీనిగాని పురుషుని గాని పెళ్ళాడవచ్చు. ఈ ఆజ్ఞ

తప్పించుకోవడం కోసం యెవరూ యీనగరంలో నుంచి వెళ్ళిపోగూడదు. ఈ శాసనం గూడా నగరానికీ జిల్లాకీ అనువర్తిస్తుంది."

రోజురోజూ వేశ్యల్లో మగవాళ్ళ సంఖ్య హెచ్చుడం చూచి చక్రవర్తి ఆవిషయంలో శాసనాలకి పదునుపట్టి దాన్ని విడిచిపెట్టేడు.

రామచంద్రయ్య సంవత్సరానికి మూడుమాట్లు చొప్పున వేశ్యావీధికి వెళ్ళి యెప్పటికప్పుడు విద్యాక్షీణతను లెక్కవేసుకుంటూ వున్నాడు.

మరి పదిసంవత్సరాలు గడిచేయి. రామచంద్రయ్య రెండుమాసాలు రాత్రింబవళ్ళు నగరం అంతా తిరిగేడు. ముసలితనం అయినా వుత్సాహం యెక్కువ అయింది. బతికి వున్న సానుల నందర్నీ వొకచోటికి చేర్చాడు. మీ వుద్దేశం యేమిటని అడిగితే వాళ్ళు యిలా చెప్పేరు.

"ఈ చక్రవర్తి వచ్చాక నిజంగా మాకు దుష్ప్రవర్తన మాత్రమే వుండిపోయింది. సానితీకం అనే పేరు లేకుండా పోతే మీ సంసారుల్లాగ మేము సుఖపళ్ళేకపోము. అయితే మా జాతి సాంప్రదాయం వేఱూ. మాతల్లులూ, మా తల్లుల తల్లులూ యే సంప్రదాయంలో వున్నారో మేం గూడా అలా వుండడమే మంచిదని మా అభిప్రాయం. ఆడవాళ్ళు పెళ్ళాడి మొగుళ్ళతో కాపరాలు చేసుకుంటూ వుంటే యెలా వుంటుందో తెలవకపోవడానికి మాలో సంసారు ల్లేకపోలేదు. మాలో స్త్రీలంతా సానులు గారు. పతివ్రత లనేకమంది వున్నారు. ఎవరూ కనిపెట్టలేరు గాని సానుల్లో గూడా పతివ్రతలున్నారు. వక జాతిలో మంచి మాత్రమే వుండదు. వక జాతిలో చెడ్డ మాత్రమే వుండదు. దీపం వుంటే దాని వెనక్కాల చీకటి కూడా వుంటుంది. యెక్కడా చీకటి లేకుండా చెయ్యాలి గాని వక చోటి చీకటిని యింకో చోటికి పంపడంలో ప్రయోజనం లేదు. లేని చోటికి చీకటిని రప్పించడం కంటే వున్నచోట "యిది ఈశ్వరవిలాసం" అని వూరుకోవడం మంచిదీ. సానులుగా వుండిపోవడం స్త్రీజాతికి అవమానం అంటే వ్యభిచరించడం మంచిదా? పెళ్ళి చెయ్యవచ్చుగాని మనస్సు పరపురుషుడి మీదకి వెళ్ళకుండా చెయ్యగలరా? సానరికం తీసెయ్యడం చేత మాకు వచ్చిన నష్టం యేమీ లేదు? కాని పూర్వం యీ యేర్పాట్లు యెందుకు జరిగాయో తెలవందే దిద్దడం అంటే యెలాగా? వేశ్యలకు ఈ సాంప్రదాయం హిందూదేశంలో సభ్యత ప్రారంభం అయినప్పణ్ణుంచీ వుంది. వేశ్యల యీ సాంప్రదాయం వల్ల మాత్రమే దేశం చెడిపోలేదు. వేశ్యలు సానరికం చేస్తూ వుండగా దేశం దుస్థితిలో వున్న కాలంకంటే సుస్థితిలో వున్న కాలం పెద్దదీ. మార్పు జరగడం ప్రకృతిధర్మం గాదా అంటే మా వృత్తిలోనూ జరిగాయి మార్పులు. లోకంలో యెన్ని మార్పులు జరిగినా వ్యభిచారం పోయిన రోజులు సృష్టిలో లేవు. విద్యల్ని చంపేరు కాని మన చక్రవర్తిగారు వ్యభిచారాన్ని లేకుండా చెయగలిగేరా? సానులు లేకుండా చెయ్యాలంటే సానులు లేని దేశాల్లో సంఘాచారాలు – ముఖ్యంగా స్త్రీపురుషుల కట్టుబాట్లు యెలా

వున్నాయో అలా యేర్పరచకపోతే సానులు లేని లోపం యేం వుంటుందీ? యిప్పుడు యీ నగరం సంగతి చూడండీ. మా బిడ్డలికి పెళ్ళిళ్ళు చేస్తున్నాం. వున్న సానుల సంఖ్య క్షీణించిపోతూనే వుంది. "సరే. నాపట్టంలో వ్యభిచారం తగ్గిపోతోంద"నే చక్రవర్తిగారు సంతోషిస్తున్నారు. కాని సానరికం తగ్గిపోయింది గాని వ్యభిచారం తగ్గిందా? నగరంలో యెన్ని కంపెనీలు బయలుదేరాయో లెక్క వేయించారా? నగరంలో వ్యభిచారం యెన్ని విధాల పరిమళిస్తూ వుందో చూశారా? యేభోగందయినా పురుషుల్ని ఆకర్షించడం కోసం గుమ్మంలో బొమ్మలా నుంచుందేమో కాని వీధే పోయీ మొగాళ్ళనీ - పడుచువాళ్లనీ, అందులో షోకుగా వున్న వాళ్ళనీ, "రావోయి బావా" అని, "అల్లుడా, వోమాటు వచ్చివెళ్ళు" అనీ, "మరిదీ, మరిచిపోయావా?" అనీ, "మామయ్యా, నేనూ. యెరగవూ?" అనీ యిలాగ సిగ్గువిడిచి పిలవడం వుందా? ఆ సంగతులన్నీ మీకే తెలుసును. మేం చెప్పడం యెందుకూ? చక్రవర్తిగారిని వోమాటు ఆబజార్లకి తీసుగువెళ్లి చూపించండి సంతోషిస్తారు."

## ⑤

రామచంద్రయ్య యిది విని తెల్లపోయాడు. వేశ్య చేసిన ఉపన్యాసానికి ఆనందమూ, చక్రవర్తి చేసిన పనికి విచారమూ, నగరంలో కులటలు చేసే పనికి సిగ్గూ పొందేడు. తక్షణం రాజసభకి వెళ్ళాడు.

అతని ఆత్రం చూసి చక్రవర్తి "యేం సంగతి" అని అడిగాడు. "రహస్యంగా మాట్లాడాలి" అని ముసలాడు చెప్పగా చక్రవర్తి అంగీకరించాడు. సభలో వున్న అందరూ అవతలికి పోయారు. "యేమిటో చెబుతాడు" అని చక్రవర్తి అనుకుంటూ వుండగా రామచంద్రయ్య "మీరు సామాన్య సంసారిలాగ మారువేషం వేసుకుని నా బండి యెక్కాలి" అని చెప్పేడు. చక్రవర్తి "యెందుక"ని అడిగేడు. గాని దానికి సమాధానం రాలేదు.

సాయంత్రం నాలుగు గంటలయింది. అనుకున్న ప్రకారం యిద్దరూ బయలుదేరారు. బండి నింపాదిగా నడుస్తోంది. ముందు వుత్తరం వేపుకి వెళ్ళారు. వీధిపొడుగునా అనేకరకాల స్త్రీలు "బావా" అనీ, "అల్లుడా" అనీ వరసలు పెట్టి పిలచారు. కొందరు చేతులు వూపారు. కొందఱు కళ్ళతో పిలిచారు. కొందరు తలలూపేరు. కొందరు కబురంపేరు. వొక పిల్ల బండి కడ్డం వచ్చి "బావా, మాయింటికిరా" అంది. "మరి నేనో" అని ముసలాడు అంటే "యింకోచోటికి వెళ్ళు" అంది.

అక్కణ్ణుంచి తూర్పువీధికీ, దక్షిణపువీధికీ, పడమటి వీధికీ వెళ్ళేరు. పేటలు కూడా తిరిగారు. అంతటా వొకలాగే వుంది. రాజమార్గాలు మామూలుగానే వున్నాయి. యిది సందుల్లోనూ, దూరపు వీధుల్లోనూ జరిగే సంగతి.

బండి చివరికి భోగం వీధికి వచ్చింది. యేమీ వికారాలగుపడలేదు. అంతా సంసారపక్షంగా వుంది. వీరికేసి చూసినవారే కనపడలేదూ. "యెందుకో" అని అనుమానంతో బయలుదేరిన చక్రవర్తి రాత్రి తొమ్మిది గంటలకి గుండెదడతోటీ, తలకాయ నొప్పితోటీ యింటికి చేరుకున్నాడు.

"శ్రమ యిచ్చినందుకు క్షమించాలి. రేపు వచ్చి మాట్లాడతాను" అని రామచంద్రయ్య చెప్పగా చక్రవర్తి వల్లగాదన్నాడు. "నా తెలివితక్కువకి వచ్చిన ఫలం చూపేవు. బుద్ధి వచ్చింది,. యేమిటి యింక దారి?" అని చక్రవర్తి అడగ్గా రామచంద్రయ్య "రేపు చెబుతాన"న్నాడు. చక్రవర్తి అతికష్టం మీద అతణ్ణి విడిచిపెట్టేడు; గాని ప్రాణం ప్రాణంలో లేదు. ధైర్యం అంతా పోయింది. సిగ్గు వచ్చింది. భోజనం మానేసి తలపట్టుకు పడుకున్నాడు. యెవరితోటీ మాట్లాడకుండానూ అతను.

## 6

తెల్లారింది. ఆరాత్రి చక్రవర్తికి చాలా పెద్దదిగా కనిపించింది. సూర్యోదయం కావడంతోటే నిలిచున్న పాళంగా రమ్మని కబురు పంపిస్తే రామచంద్రయ్య "పెందలాడే నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని వస్తాన"ని జవాబు చెప్పేడు. "రాత్రి భోజనం లేదు. యిప్పుడు కాఫీ అయినా పుచ్చుకోలేదు. నువ్వు వచ్చేదాకా పచ్చి మంచినీళ్ళైనా ముట్టను" అని చక్రవర్తి మళ్ళీ కబురు పంపగా రామచంద్రయ్య "యీ కాలం వాళ్ళతో యేం వచ్చినా చిక్కే" అని బయలుదేరిపోయేడు.

రామచంద్రయ్య వెళ్ళేటప్పటికి చక్రవర్తి మంచంమీద పడుకుని వున్నాడు. "చేసిన తప్పు తెలిసింది, అప్పుడు వినలేకపోయాను. అప్పుడు చేసిన తప్పుకు వొక వారమూ, విద్యలు చంపినందుకు వొక వారమూ, సంఘంలో యింత వ్యభిచారం పెరగడానికి అవకాశం యిచ్చినందుకు వక వారమూ వుపవాసం చేస్తాను. దానికేం గాని ముందు గతి చూపించు" అని చక్రవర్తి కాళ్ళమీద పడ్డాడు.

అనుచరులంతా తెల్లపోయారు. వైద్యులు మొగమొగాలు చూచుకున్నారు. బంగాళీలు దూరంగా కూచున్నట్లే కూచుని వెళ్ళిపోయారు. దొరలు "మామతంలో కలిస్తేగాని హిందూ దేశానికి ముక్తి లేద"ని చెప్పి వెళ్ళిపోయేరు. బంగాళీల దగ్గిరా దొర్లదగ్గిరా తయారయిన శిష్యులు మాత్రం మొగాలు వంచుకుని కూచున్నారు.

అప్పుడు రామచంద్రయ్య లేచి యిలా చెప్పేడు. "ముందు గతి చెప్పు" అంటే "ముసలివాణ్ణీ, పూర్వకాలపువాణ్ణీ అయిన నేనేమి చెప్పగలనూ? కొండ యెక్కించి తుదకి దొరలూ, బంగాళీలు వెళ్ళిపోతూ వుంటే వూరుకుని నన్ను పట్టుకుంటే నేనేం చెప్పగలనూ? మీరంతా సంఘం బాగుపడాలని చూస్తూ వుంటారు. మేమంతా విషయ సుఖాలకోసమూ, స్వేచ్ఛావిహారం కోసమూ చూస్తూ

వుంటాము. మీకు సుఖం మాట అంత పట్టింపు లేదు. నీతి కావాలి. మాకు నీతి అక్కర్లేదు. మూఢాచారం అంటే మాకు అభిమానం. దేశాభివృద్ధికి మా భావాలన్నీ అడ్డే. విదేశభాషల్లో పండితులు అయినాక యిక మీకు మన విద్య లెందుకూ? మేము యేమీ చేతకానివాళ్ళం కనక ఆపూర్వకాలపు చేదస్తపు విద్యలంటే పడి చచ్చిపోతాము. అలా చెయ్యడానికి మీకేం వచ్చింది? భాషలన్నీ నేర్చుకునీ, దేశదేశాలు చూసి మీరు న్యాయమూ, నీతీ, ధర్మమూ యింకా యిలాంటివీ నేర్చుకున్నారు. మాకేం తెలుసునూ? భోగం వాళ్ళు లేందే మాకు రోజు గడవదాయెను. సిగ్గు విడిచి వాళ్ళని సభలోకి తెచ్చుకుంటామాయెను. వాళ్ళు లేందే దేవతాదర్శనం కూడా చెయ్యమాయెను. అలాగ నీతిని విడిచిపెట్టిన వాళ్ళం మేము మీకు ముందు గతి చెప్పడం యేమిటీ? మేం విద్యల్ని మాటు పెట్టి వ్యభిచారం సమర్థిస్తాము. మీరు విద్యలు పోయినా సరే ధర్మం నాలుక్కాళ్ళా నడవాలంటారు. మాకూ మీకూ యింత దూరం వుంది. యింత తేడా వుంది. యింత భేదం వుంది. యింత వ్యత్యాసం వుంది. మేం చీకట్లో వుండిపోవడానికే చూస్తాం. మీరు వెలుగులోకి వెళ్ళడానకి పైకెగురుతారు. మేము బుద్ధిపూర్వకంగా చెడ్డపనులు చేస్తాం. మీరు ప్రకృతిని గూడా దిద్దేస్తారు. మాకూ, మీకూ యింత వార వుంది. యింత గ్రంథం వుంది. "భోగం వాళ్ళలో సానులు లేకుండా చేశాం" అని మీరు గర్విస్తే మేం అడ్డు చెప్పడానికి యేమీ లేదు; గాని మీరు వేశ్యలని బాగుచేసి కులటల్ని వృద్ధి చేశారని మేం యెన్నివేల గుండెలతో చెప్పగలమూ? "నాగరికత వృద్ధిపొంది పోతోంది" అని మీరు సంతోషపడుతూ వుంటే మేము మీ దగ్గిర యేం మాట్లాడగలమూ?"

చక్రవర్తి అడ్డువచ్చి "బుద్ధి వచ్చింది" అన్నాడు. అయితే హతశేషం ముసలి సానులు యేమాత్రమో వున్నారు. పిలిపించండి" అని రామచంద్రయ్య చెప్పగా వెంటనే కబురు పంపేడు. "వ్యభిచారం తగ్గిందో హెచ్చిందో లెక్కలు తయారు చేయించండి" అని గూడ చెప్పగా "లెక్కలు అక్కర్లేదు. తెలుస్తూనే వుంది" అని చక్రవర్తి చెప్పేడు.

ముసలి సానులు వచ్చేరు. అభయం పొంది నలుగురూ నాలుగు మాటలూ అన్నారు. చక్రవర్తి "యిక పెద్దల మార్గం తప్పన"న్నాడు.

యిది యెప్పుడో జరిగిన సంగతి. దుప్పలపూడి సామ్రాజ్యం ప్రకృతస్థితిని తెలుసుకుని యింకోమాటు మనవి చేసుకుంటాం.

❀ ❀ ❀